ఉత్తరం
# కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
ఆదివారం, 30 ఆగస్టు 2026 | సంపుటి: 02 సంచిక: 17 | పేజీలు: 4 వెల: 5



## సబ్‌రిజిస్ట్రార్ల పనితీరులో మార్పు రావాలి

- ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పితే చర్యలు తప్పవు
- పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి
- రీ-సర్వేను అక్టోబరు చివరికల్లా పూర్తి చేయాలి
- ఇందిరమ్మ ఇళ్ల సమస్యలకు 15 రోజుల్లో పరిష్కారం
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష

2

# పోరాటమే నా బలం

- నా రాజకీయ ప్రస్థానానికి అదే పునాది
- దాట్లలో మా మూలాలు.. హన్మకొండలో నా బాల్యం
- జెండా దగ్గరే మొదటి పోరాటం.. కాలేజీలో తొలి కేసు
- కిన్నెర మా అడ్డా.. ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ఎదిగాను
- యూత్ కాంగ్రెస్‌తో రాజకీయ మలుపు.. టికెట్ కోసం సుదీర్ఘ పోరాటం
- రేవంత్‌రెడ్డితో మళ్లీ పోరాటం.. కేసులైనా కండువా మార్చలేదు
- రాహుల్ నుంచి నేరుగా ఫోన్.. రాజకీయాల్లో అది మరిచిపోలేని గౌరవం
- వరంగల్ బ్రాండ్ పెంచడమే లక్ష్యం..
- డిజిటల్ మీడియా ప్రతినిధులతో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చిట్‌చాట్

4



"నన్ను తొక్కాలని సొంత పార్టీలోనూ చూశారు. పార్టీ మారితే కేసులు మాఫీ చేస్తామన్నారు. అయినా కాంగ్రెస్ కండువా తప్ప మరో కండువా నా మెడలో ఉండదని తేల్చిచెప్పా" అని ఆయన తన రాజకీయ ప్రయాణంలోని కీలక ఘట్టాలను గుర్తుచేసుకున్నారు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి. సెయింట్ జాన్స్ స్కూల్‌లో మొదలైన అల్లరి.. జెండా దగ్గర జరిగిన తొలి పోరాటంతో వచ్చిన గుర్తింపు.. చదువు అబ్బక బర్లు కాయడానికి పంపిస్తానన్న తండ్రి హెచ్చరిక.. ఇంటర్‌లోనే పోలీస్ కేసు.. కిన్నెర హోటల్ వద్ద సాగిన విద్యార్థి రాజకీయాలు.. డిగ్రీలో ఎన్ఎస్‌యూఐ అధ్యక్ష పదవి.. యూత్ కాంగ్రెస్ నుంచి మొదలైన రాజకీయ మలుపులు.. టికెట్ కోసం సాగిన సుదీర్ఘ నిరీక్షణ.. చివరకు ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టిన ప్రయాణం. మధ్యలో 54 కేసులు, మర్డర్ కేసులో ఇరికించే ప్రయత్నాలు, పార్టీ మారితే కేసులు మాఫీ చేస్తామన్న ప్రలోభాలు.. అయినా కండువా మార్చని పట్టుదల. రాహుల్‌గాంధీ నుంచి నేరుగా వచ్చిన ఫోన్ నుంచి రేవంత్‌రెడ్డితో టికెట్ కోసం చేసిన పోరాటం వరకు నా జీవితంలో ఎన్నో మలుపులు. దాట్లలో మొదలైన కుటుంబ కథ నుంచి వరంగల్ బ్రాండ్‌ను పెంచాలన్న లక్ష్యం వరకు.. నా జీవితంలో ప్రతి మలుపూ ఓ పోరాటమే. కాలం మారింది.. రాజకీయాలు మారాయి.. అప్పటి రాజకీయ సంస్కారం మాత్రం తిరిగి రావడం లేదన్నదే నా బాధ అంటూ నాయిని రాజేందర్ రెడ్డి తన గతాన్ని గుర్తు చేసుకున్నారు. . విద్యార్థి దశలో మొదలైన పోరాట స్వభావమే తన రాజకీయ జీవితానికి పునాదిగా మారిందని, చివరకు ఎమ్మెల్యేగా అసెంబ్లీలో కూర్చోవాలన్న తన కలను సాకారం చేసుకున్నానని వెల్లడించారు. శనివారం డిజిటల్ మీడియా ప్రతినిధులతో తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన చిట్‌చాట్‌లో అనేక ఆసక్తికర అంశాలను వెల్లడించారు. ఆ వివరాలను ఆయన మాటల్లోనే..!

## రెండోరోజూ ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ లాటరీ

- 1,920 ఇళ్లకు కేటాయింపులు.. ఆన్‌లైన్‌లో ఎంపికైన వారి వివరాలు
- నాలుగు నియోజకవర్గాల్లో పారదర్శకంగా ప్రక్రియ
- అభ్యంతరాలు, ఫిర్యాదులకు అవకాశం
- హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ విపి గౌతమ్



2

## హైదరాబాద్ రెస్టారెంట్లలో టీజీ సేఫ్ తనిఖీలు

- ఏడు రెస్టారెంట్లలో ఆహార భద్రత ఉల్లంఘనలు
- 11 నమూనాలు సేకరణ



2

# అసెంబ్లీకి రాజకీయ సెగ

## సెప్టెంబర్ 7 నుంచి రెండో విడత సమావేశాలు

- 22ఏ భూములు.. సాగునీటి హక్కులపై విపక్షాల దూకుడు
- ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగం.. రైతు సమస్యలపైనా పోరు
- కాళేశ్వరం, హైడ్రా.. సింగరేణిపైనా నిలదీత
- భూకేటాయింపులు, క్షుద్ర పూజల వివాదాలపై దుమారం
- అమెరికా పర్యటన రద్దు.. కుటుంబ సర్వేపైనా ప్రశ్నలు

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** రాష్ట్ర రాజకీయ వేడి ఇక అసెంబ్లీకి చేరనుంది. గత కొంతకాలంగా రోడ్డెక్కి సాగుతున్న ఆందోళనలు, ప్రభుత్వంపై ప్రతిపక్షాల విమర్శలు, అధికార పక్షం ఎదురుదాడులు శాసనసభ వేదికగా ప్రత్యక్ష పోరుగా మారనున్నాయి. తెలంగాణ రాష్ట్ర మూడో శాసనసభ ఎనిమిదో సమావేశాల్లో రెండో విడత సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభం కానుంది. ప్రజా సమస్యలతో పాటు ప్రభుత్వ నిర్ణయాలు, వివాదాస్పద అంశాలు, పెండింగ్ హామీలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చకు ఇరుపక్షాలు అస్త్రశస్త్రాలతో సిద్ధమవుతున్నాయి. గత సమావేశాల కొనసాగింపుగా ఈ విడత సభ రాజకీయంగా మరింత ప్రాధాన్యం సంతరించుకోనుంది. అసెంబ్లీ సమావేశాల సమాచారాన్ని శాసనసభ కార్యదర్శి రండ్ల తిరుపతి ఎమ్మెల్యేలకు అధికారికంగా పంపించారు. సమావేశాలకు సభ్యులంతా విధిగా హాజరు కావాలని కోరారు. సభ ఎన్ని రోజులు కొనసాగాలనే అంశాన్ని తొలి రోజు జరిగే బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో నిర్ణయించనున్నారు. ప్రజా సమస్యలను ప్రస్తావించేందుకు ప్రతిపక్షాలు ఇప్పటికే అంశాలను సిద్ధం చేసుకుంటుండగా, వాటికి సమాధానాలు ఇచ్చేందుకు అధికార పక్షం కూడా శాఖలవారీగా రికార్డులు, గణాంకాలను సిద్ధం చేసుకుంటోంది. ప్రజా సంక్షేమ పథకాల అమలు, కొత్త చట్టాల ఆమోదంపైనా ప్రభుత్వం దృష్టి పెట్టనుంది.

**22ఏ భూముల నుంచి సాగునీటి హక్కుల వరకు**

ఇటీవల రాష్ట్రంలో నిరసనలకు దారితీసిన 22ఏ నిషేధిత భూముల వ్యవహారం అసెంబ్లీలో ప్రధాన చర్చనీయాంశంగా మారే అవకాశముంది. బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలు, నిషేధిత జాబితాలో భూముల చేరిక, వాటి పరిష్కారంపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రతిపక్షాలు ప్రశ్నించనున్నాయి. కృష్ణా, గోదావరి నదీ జలాల హక్కుల పరిరక్షణ అంశంపైనా అధికార పక్షాన్ని గట్టిగా నిలదీసేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంలో ప్రభుత్వ వైఖరి, సాగునీటి లభ్యత వంటి అంశాలపై వాడీవేడిగా చర్చ జరిగే అవకాశం ఉంది. జీవో తొంభై ఏడు రద్దు చేయాలని

........(తరువాయి 2లో)



# నేపాల్‌లో మృత్యుఘోష

## రోజుకు వందల్లో బయట పడుతున్న శవాలు

- ఇప్పటి వరకు 600కు పైగా మృతదేహాలు లభ్యం
- గల్లంతైన 2400 మంది.. ఆచూకీ కోసం బంధువుల ఎదురుచూపులు
- బురదలో కూరుకుపోయిన ఇళ్లు.. కొట్టుకుపోయిన రోడ్లు, వంతెనలు
- సొరంగంలో చిక్కుకున్న 350 మంది సురక్షితం
- 2500 మందికిపైగా సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- 11000 మందికిపైగా భద్రతా సిబ్బందితో సహాయక చర్యలు
- వర్షా లు కొనసాగే అవకాశం.. మరింత కష్టతరం కానున్న గాలింపు



2

## ఇందిరానగర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

- ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యం
- సంక్షేమంతోపాటు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం
- సౌర విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలి..
- అర్హులందరూ పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలి
- సమన్వయంతో గ్రామాభివృద్ధి సాధ్యం : మంత్రి పొన్నం ప్రభాకర్




3

- కలెక్టరేట్ ముట్టడిస్తాం.. నిషేధిత జాబితాలోంచి తీసేంత వరకు వంటావార్పు
- పటాన్‌చెరువులో 50 వేల ఎకరాలు, లక్ష ఇళ్లు 22ఏలో పెట్టడం దారుణం
- 30–40 ఏళ్లుగా నివసిస్తున్న వారిని కబ్జాదారులంటారా?
- బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు




# 22ఏ బాధితుల పక్షాన పోరాటం చేస్తాం

**కాకతీయ, సంగారెడ్డి :** పేద, మధ్యతరగతి ప్రజల కష్టార్జితంతో నిర్మించుకున్న ఇళ్లు, భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. పటాన్‌చెరువు నియోజకవర్గంలోనే దాదాపు లక్ష ఇళ్లు, 50,565 ఎకరాల భూములను 22ఏ జాబితాలో పెట్టారని మండిపడ్డారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరించకపోతే బాధితులతో కలిసి సంగారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. పటాన్‌చెరువు నియోజకవర్గ పరిధిలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం 22ఏ భూముల బాధితుల సమావేశం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి హరీశ్‌రావు హాజరయ్యారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, బాధిత కుటుంబాలు పాల్గొన్నారు. సింఫోని కాలనీ, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాల బాధితులు తమ సమస్యలను హరీశ్‌రావు దృష్టికి తీసుకువచ్చారు. దశాబ్దాలుగా నివసిస్తున్న ఇళ్లను కూల్చివేస్తున్నారని, రిజిస్ట్రేషన్లు

........(తరువాయి 2లో)

# ప్రాణహితకు పునరుజ్జీవం

- 152 మీటర్ల బ్యారేజీకి తెలంగాణ పట్టు
- సెప్టెంబరు 1న తెలంగాణ–మహారాష్ట్ర కీలక చర్చలు
- 80 టీఎంసీలను గురుత్వాకర్షణతో సుందిళ్లకు తరలించే అవకాశం
- భారీ ఎత్తిపోతలతో పాటు విద్యుత్ వ్యయాన్ని తగ్గించే దిశగా అడుగులు
- రాష్ట్ర జల ప్రయోజనాల పరిరక్షణలో రాజీ లేదు
- : మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పునరుజ్జీవింపజేసి, అసలు పథకంలో తెలంగాణ రైతాంగానికి ఉద్దేశించిన సాగునీటి ప్రయోజనాలను తిరిగి సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత నదిపై 152 మీటర్ల స్థాయిలో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర సమ్మతి సాధించడమే లక్ష్యంగా సెప్టెంబరు 1న ఢిల్లీలో కీలక అంతర్రాష్ట్ర చర్చలు జరగనున్నాయి. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ నేతృత్వంలో తెలంగాణ-మహారాష్ట్ర ఉన్నతాధికారుల మధ్య ఈ చర్చలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం సచివాలయంలో ఉన్నతస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,

........(తరువాయి 2లో)

# సబ్‌రిజిస్ట్రార్ల పనితీరులో మార్పు రావాలి

- ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పితే చర్యలు తప్పవు
- పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి
- రీ-సర్వేను అక్టోబరు చివరికల్లా పూర్తి చేయాలి
- ఇందిరమ్మ ఇళ్ల సమస్యలకు 15 రోజుల్లో పరిష్కారం
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమీక్ష

**కాకతీయ, సూర్యాపేట :** ప్రజలు తమ భూ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ పదేపదే తిరిగే పరిస్థితికి స్వస్తి పలకాలని, తహసీల్దార్లు, సబ్‌రిజిస్ట్రార్ల పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భూములకు సంబంధించిన ప్రతి దరఖాస్తును సానుకూల దృక్పథంతో పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా ప్రజలను వేధిస్తున్న భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తూనే, రెవెన్యూ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా అధికారులు పనిచేయాలని సూచించారు. శనివారం సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, గృహ నిర్మాణ శాఖల సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలను అర్థం చేసుకోవడం, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడం అధికారుల ప్రాథమిక బాధ్యతగా ఉండాలని అన్నారు.

**45 దరఖాస్తులు పెండింగ్‌లో ఎలా?**

యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు తహసీల్దార్ లాగిన్‌లో భూములకు సంబంధించిన 45 దరఖాస్తులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉండటాన్ని మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇంతకాలం దరఖాస్తులు ఎందుకు పరిష్కరించలేదో సంబంధిత తహసీల్దార్‌ను వివరణ కోరాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్న తర్వాత వాటిని రోజుల తరబడి పెండింగ్‌లో ఉంచడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ప్రతి దరఖాస్తుపై సంబంధిత అధికారి వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని, నిర్ణీత సమయంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్లు, సబ్‌రిజిస్ట్రార్లు తమ కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను సేవా దృక్పథంతో పరిష్కరించాలని మంత్రి సూచించారు. అవసరం లేని పత్రాలు, ప్రక్రియల పేరుతో ప్రజలను తిప్పుకోవడం, చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి కూడా రోజుల తరబడి వేచి ఉండేలా చేయడం వంటి విధానాలకు ఇక చోటు ఉండకూడదన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమస్యలను సానుకూలంగా పరిశీలించాలని, రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన వ్యక్తి సంతృప్తితో తిరిగి వెళ్లేలా చూడాలని స్పష్టం చేశారు. భూ భారతి చట్టంలోని నిబంధనలను పాటించడంతోపాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. చట్టాన్ని అమలు చేసే క్రమంలో ప్రజల సమస్యలను మరింత జటిలం చేయకుండా పరిష్కార మార్గాలను చూపాలని సూచించారు.

**అక్టోబరు చివరికల్లా రీ-సర్వే పూర్తి**

రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో చేపట్టిన రీసర్వేను అత్యంత ప్రాధాన్యంతో చేపట్టి అక్టోబరు చివరి నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. డిసెంబరులో రెండో విడత రీసర్వే ప్రారంభించేందుకు ఇప్పటి నుంచే అవసరమైన కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. తొలి విడతలో రీసర్వే జరుగుతున్న 70 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పారదర్శకంగా సాగాలని, గ్రామ సరిహద్దులను పక్కాగా నిర్ధారించాలని అన్నారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు క్షేత్రస్థాయిలో రీసర్వే పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని, ఆర్డీవోలు, తహసీల్దార్లు గ్రామసభలకు హాజరై పరిస్థితులను తెలుసుకోవాలని ఆదేశించారు. సర్వే పూర్తయిన రోజే సంబంధిత భూ రికార్డులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. సర్వేయర్ల కొరత ఉన్న ప్రాంతాల్లో అవసరమైతే పక్క మండలాల నుంచి సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని తెలిపారు. విధులకు హాజరుకాని లైసెన్స్‌డ్ సర్వేయర్లపై చర్యలు తీసుకోవడంతోపాటు అవసరమైతే వారి లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు.

**ఇందిరమ్మ ఇళ్లపై 15 రోజుల్లో స్పష్టత**

ఇందిరమ్మ ఇళ్ల తొలి విడతలో ఉన్న ఎల్1, ఎల్2, ఎల్3 సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా ఎల్3 సమస్యలు 15 రోజుల్లో లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. తొలి విడతలో అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను దసరాలోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచిపోయిన చోట్ల కారణాలను గుర్తించి, 15 రోజుల్లో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పన్నులు, రవాణా చార్జీలతో కలిపి రూ.230కే సిమెంట్ బస్తా అందించేలా సిమెంట్ కంపెనీలతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను లబ్ధిదారులకు సమీపంలో ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడి నుంచి సరఫరా చేసేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నల్గొండ పట్టణంలో ఇందిరమ్మ టవర్స్ కింద 500 గృహాల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**ఇంటి పట్టాల పంపిణీకి వేగం**

గతంలో ఇంటి పట్టాల కోసం భూములను గుర్తించినప్పటికీ ఇప్పటికీ పంపిణీ చేయని భూములను వెంటనే గుర్తించాలని మంత్రి ఆదేశించారు. అటువంటి వాటికి ప్రత్యేక జాబితా రూపొందించి, అర్హులైన లబ్ధిదారులకు పట్టాల పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించిన సమస్యలను కూడా చట్టానికి లోబడి శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒకసారి పరిష్కరించిన సమస్య మళ్లీ ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పేలా మారకూడదని స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు పొందడం హక్కు అని, ఆ సేవలను అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పేర్కొన్నారు. భూ సమస్యలు, రిజిస్ట్రేషన్, సర్వే, గృహ నిర్మాణానికి సంబంధించిన అంశాల్లో ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. నిర్ణీత సమయంలో దరఖాస్తులను పరిష్కరించడం ద్వారా రెవెన్యూ వ్యవస్థపై విశ్వాసాన్ని మరింత పెంచాలని అన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని, సమస్యలను ఫైళ్లకే పరిమితం చేయకుండా అక్కడికక్కడే పరిష్కరించే దిశగా పనిచేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు.



# 22ఏ బాధితుల పక్షాన పోరాటం చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

నిలిచిపోయాయని, బ్యాంకు రుణాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు ఎమ్మార్వోలు లంచాలు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు.

**ఐదు మండలాల్లో 50,565 ఎకరాలు నిషేధిత జాబితాలో..**

ఒక్క పటాన్‌చెరువు నియోజకవర్గంలోనే అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, వ్యక్తిగత ఇళ్లను కలిపి దాదాపు లక్ష ఇళ్లను 22ఏ జాబితాలో చేర్చారని హరీశ్‌రావు ఆరోపించారు. గుమ్మడిదలలో 12,432 ఎకరాలు, అమీన్‌పూర్‌లో 3,200, రామచంద్రాపురంలో 8,300, పటాన్‌చెరువులో 12,300, జిన్నారంలో 13,900 ఎకరాలు కలిపి మొత్తం 50,565 ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టారని తెలిపారు. 1980లో లేఅవుట్లు చేసి, 30-40 ఏళ్లుగా ఇళ్లలో నివసిస్తున్నవారిని ఇప్పుడు కబ్జాదారులుగా పేర్కొనడం దారుణమన్నారు. హుడా, మున్సిపల్ అనుమతులు, విద్యుత్, నల్లా కనెక్షన్లు ఇచ్చి, ఆస్తిపన్నులు వసూలు చేసిన తర్వాత అదే ఆస్తులను 22ఏలో చేర్చడం ఏమిటని ప్రశ్నించారు. నిషేధిత జాబితాలో భూములు ఉంటే రైతుబంధు, రైతుబీమా, పంటలకు కనీస మద్దతు ధర వంటి ప్రయోజనాలు కూడా ప్రభావితమవుతాయని పేర్కొన్నారు.

**సీఎం, మంత్రి ఆస్తులు ఎలా తొలగించారు?**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆస్తులు కూడా 22ఏ జాబితాలో ఉన్నాయని తాను వెల్లడించిన తర్వాత ఎలాంటి దరఖాస్తు లేకుండానే రాత్రికి రాత్రే వాటిని జాబితా నుంచి ఎలా తొలగించారని హరీశ్‌రావు ప్రశ్నించారు. సామాన్యుల ఆస్తులకు ఒక నిబంధన, అధికారంలో ఉన్నవారి ఆస్తులకు మరో నిబంధన ఉందా అని నిలదీశారు. 98 శాతం 22ఏ సమస్యను పరిష్కరించామని మంత్రి పొంగులేటి చెబుతున్నారని, అలాంటప్పుడు పటాన్‌చెరువులో ఇంకా 50 వేల ఎకరాలు, లక్ష ఇళ్లు ఎందుకు నిషేధిత జాబితాలో ఉన్నాయని ప్రశ్నించారు. ఈ వ్యవహారంతో రేవంత్‌రెడ్డికి సంబంధం లేకపోతే పొంగులేటిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.

**వారం రోజుల్లో పరిష్కరించకపోతే కలెక్టరేట్ ముట్టడి: తన్నీరు హరీశ్‌రావు**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జీవో 58, 59 కింద పటాన్‌చెరువులో 9 వేల మందికి పైగా పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామని హరీశ్‌రావు తెలిపారు. అమీన్‌పూర్‌కు తాగునీరు, ఐటీఐ, పాలిటెక్నిక్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి వారం రోజుల్లో 50 వేల ఎకరాల నిషేధిత భూముల జాబితాను కలెక్టర్‌కు అందజేస్తారని తెలిపారు. వారం రోజుల్లోగా భూములు, ఇళ్లను 22ఏ నుంచి బేషరతుగా తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులు, ఇళ్ల బాధితులను సమీకరించి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని, అక్కడే వంటావార్పు నిర్వహించి, సమస్య పరిష్కారమయ్యే వరకు బైఠాయిస్తామని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హెచ్చరించారు.

# అసెంబ్లీకి రాజకీయ సెగ

(మొదటిపేజీ తరువాయి)

పాలిటెక్నిక్ విద్యార్థులు చేస్తున్న ఆందోళనలను కూడా సభ దృష్టికి తీసుకురానున్నారు. కళాశాల విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లు, రైతు సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలు చర్చకు రానున్నాయి. నిరుద్యోగుల సమస్యలపై చర్చ చేపట్టాలని ప్రతిపక్షాలు ప్రత్యేక నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు పూర్తిస్థాయి గణాంకాలతో సభలోకి రావాలని ప్రతిపక్ష నేతలు కసరత్తు చేస్తున్నారు.

**కాళేశ్వరం నుంచి హైడ్రా వరకు**

కాళేశ్వరం ఎత్తిపోతల పథకం వినియోగం, నిర్వహణ తీరుపై అసెంబ్లీలో తీవ్ర చర్చ జరిగే అవకాశముంది. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన పరిస్థితులు, వర్షపాతం తగ్గుదల, సాగునీటి వనరులపై వాటి ప్రభావం వంటి అంశాలు ప్రస్తావనకు రానున్నాయి. హామ్ రోడ్ల నిర్మాణానికి కేటాయించిన పనులు, అమృత్ పథకం టెండర్లలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపైనా విపక్షాలు ఆధారాలతో ప్రభుత్వాన్ని నిలదీయనున్నాయి. సింగరేణి సంస్థలో బొగ్గు నిల్వలు మాయమయ్యాయన్న ఆరోపణలపైనా సమాధానం కోరే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులకు భూ కేటాయింపులు చేశారన్న ఆరోపణలు ఇప్పటికే రాజకీయంగా దుమారం రేపాయి. ఈ వ్యవహారాన్ని కూడా ప్రతిపక్షాలు సభలో ప్రస్తావించనున్నాయి. హైదరాబాద్‌లో హైడ్రా చేపడుతున్న అక్రమ నిర్మాణాల కూల్చివేతలు, ప్రజాప్రతినిధుల భూముల విషయంలో జరుగుతున్న చర్యలపైనా వాడీవేడిగా చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది. రాజకీయ కారణాలతోనే కొందరిని లక్ష్యంగా చేసుకుంటున్నారని ప్రతిపక్షాలు ఆరోపించనున్నాయి. అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై పారదర్శక చర్యల్లో భాగంగానే హైడ్రా వ్యవహరిస్తోందని అధికార పక్షం బదులివ్వనుంది.

**హరీశ్‌రావు వ్యవహారం..**

**అమెరికా పర్యటన**

మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యవహారంలో తెరపైకి వచ్చిన క్షుద్ర పూజల వివాదం కూడా సభలో ప్రకంపనలు సృష్టించే అవకాశం ఉంది. రాజకీయ ప్రయోజనాల కోసమే నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ప్రతిపక్షం వాదించనుండగా, ఈ వ్యవహారంపై విచారణకు అధికార పక్షం డిమాండ్ చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన హఠాత్తుగా రద్దు కావడానికి గల కారణాలపైనా ప్రతిపక్షాలు ప్రశ్నలు సంధించనున్నాయి. పర్యటన రద్దుకు దారితీసిన పరిస్థితులేమిటో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేసే అవకాశం ఉంది. మరోవైపు సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియ అమలు తీరుపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఆ అంశాన్ని సభలో ప్రస్తావించేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. ప్రభుత్వ పనితీరును ప్రతి అంశంలోనూ ప్రశ్నించేందుకు ప్రతిపక్ష పార్టీలు కసరత్తు పూర్తి చేశాయి.


**మాటల యుద్ధానికి వేదిక**

గత కొంతకాలంగా రాష్ట్రంలో కొనసాగుతున్న రాజకీయ విమర్శల యుద్ధం ఇప్పుడు అసెంబ్లీ వేదికగా మరింత తీవ్ర రూపం దాల్చనుంది. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ అధికార పక్షం ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేయనుంది. ప్రస్తుతం ప్రభుత్వ పాలనలో చోటుచేసుకున్న లోపాలు, అమలు కాని హామీలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ముందుకు తెచ్చి అధికార పక్షాన్ని ఇరుకున పెట్టేందుకు విపక్షాలు వ్యూహం సిద్ధం చేసుకున్నాయి. సభా నిబంధనల ప్రకారం చర్చలు సజావుగా సాగేందుకు స్పీకర్ తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే అంశాల తీవ్రత, రాజకీయంగా ఇరుపక్షాల మధ్య పెరిగిన దూరం నేపథ్యంలో సభలో వాగ్వాదాలు, ఆందోళనలు చోటుచేసుకునే అవకాశాలు లేకపోలేదు. ప్రజా సమస్యలపై పోటాపోటీగా ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకునేందుకు అధికార, ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. దీంతో సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలు రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని ప్రతిబింబించే వేదికగా మారనున్నాయి. తొలి రోజు బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశం అనంతరం సభ ఎన్ని రోజులు కొనసాగనుంది, ఏ అంశాలకు ఎంత సమయం కేటాయించనున్నారు, చర్చల క్రమం ఎలా ఉండనుందనే దానిపై పూర్తి స్పష్టత రానుంది.

# విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో రాణించాలి..

- పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు
- భక్తు రాజ్‌కుమార్

**కాకతీయ, శంకరపట్నం:** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలోని కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను కేశవపట్నం క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ క్రీడాకారుడు వంగోజ్ సంపత్ మాట్లాడుతూ.. ఒలింపిక్స్‌లో వరుసగా మూడు సార్లు బంగారు పతకాలు సాధించిన మేజర్ ధ్యాన్ చంద్‌ను స్ఫూర్తిగా తీసుకుని యువత క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో



పాటు మానసిక వికాసానికి దోహదపడతాయని తెలిపారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు భక్తు రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో రాణించి, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు స్పోర్ట్స్ కోటాను సద్వినియోగం చేసుకుని ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# నేపాల్‌లో మృత్యుఘోష

**కాఠ్మాండు:** ఆసుపత్రుల గోడలపై మృతుల ఫొటోలు.. ఆ జాబితాల్లో తమవారి కోసం ఆత్రంగా వెతుకుతున్న బంధువులు.. బురదలో, శిథిలాల మధ్య తమకు మిగిలిన సామగ్రి కోసం అన్వేషిస్తున్న కుటుంబాలు.. దెబ్బతిన్న భవనాల మధ్య పసిబిడ్డను ఎత్తుకుని నడుస్తున్న బాధిత మహిళ.. శిథిలాల మధ్య కనిపిస్తున్న మూగజీవాల కళేబరాలు.. నేపాల్‌ను ఆకస్మిక వరదలు ఎంతటి విషాదంలోకి నెట్టాయో ఈ దృశ్యాలు కళ్లకు కడుతున్నాయి. రోజులు గడుస్తున్న కొద్దీ గల్లంతైన వారి కుటుంబాల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయి. మరోవైపు ప్రతికూల వాతావరణాన్ని సైతం లెక్కచేయకుండా సహాయక బృందాలు బురదను తొలగిస్తూ, శిథిలాలను పక్కకు జరుపుతూ గాలింపు కొనసాగిస్తున్నాయి. బుధవారం నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు గ్రామాలు, పట్టణాలను అతలాకుతలం చేశాయి. వరద ఉద్ధృతికి ఇళ్లు, వాహనాలు, రహదారులు, వంతెనలు కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. శనివారం నాటికి మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2400 మంది గల్లంతయ్యారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతుండటంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నా.. రెస్క్యూ సిబ్బంది మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఇప్పటివరకు 163 మంది విదేశీయులతో పాటు దాదాపు 2500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

**ఆచూకీ కోసం కన్నీటి అన్వేషణ**

ఆసుపత్రుల వెలుపల కనిపిస్తున్న దృశ్యాలు హృదయవిదారకంగా మారాయి. చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వివరాలను తెలుసుకునేందుకు కుటుంబ సభ్యులు బారులు తీరుతున్నారు. తమవారు బతికున్న వారి జాబితాలో ఉన్నారేమోనని పేర్లు, ఫొటోలను నిశితంగా పరిశీలిస్తున్నారు. అక్కడ ఆచూకీ లభించకపోతే మృతుల ఫొటోలున్న జాబితా వద్దకు భారమైన హృదయంతో వెళ్తున్నారు. తమవారిని గుర్తించాల్సిన పరిస్థితి రావడంతో పలువురు కన్నీరుమున్నీరవుతున్నారు. మరోవైపు రెస్క్యూ సిబ్బంది రాత్రింబవళ్లు తేడా లేకుండా గాలింపు చేపడుతున్నారు. వర్షాన్ని, బురదను లెక్కచేయకుండా గల్లంతైన వారి కోసం అన్వేషిస్తున్నారు.

**సొరంగంలో బురద.. 350 మంది రక్షణ**

అప్పర్ త్రిశూలి మూడు ఏ జలవిద్యుత్ ప్రాజెక్టు వద్ద వందలాది మంది కార్మికులు సొరంగంలో చిక్కుకుపోయారు. భారీగా బురద పేరుకుపోవడంతో వారిని బయటకు తీసుకురావడం సవాలుగా మారింది. నేపాల్ హోంమంత్రి సుదన్ గురుంగ్ స్వయంగా ప్రొక్లైన్లతో బురద తొలగింపు పనులను పర్యవేక్షించారు. సొరంగంలో చిక్కుకున్న 350 మందిని నేపాల్ ఆర్మీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చినట్లు ఆన్‌లైన్ ఖబర్ పేర్కొంది. మధ్య నేపాల్‌లోని గ్రామాల్లో వరద సృష్టించిన విధ్వంసం తీవ్రంగా కనిపిస్తోంది. భవనాలు కొన్ని అడుగుల మేర బురదలో కూరుకుపోయాయి. వాహనాలు సగం వరకు మట్టిలో చిక్కుకున్నాయి. రోడ్లు, ఇతర మౌలిక వసతులు వరద ఉద్ధృతికి కొట్టుకుపోయాయి. నువాకోట్ జిల్లాలోని దేవిఘాట్ గ్రామంలో ప్రజలు మోకాళ్ల లోతు బురదలో, శిథిలాల మధ్య తమ వస్తువుల కోసం వెతుకుతున్నారు. ఓ వ్యక్తి శిథిలాల నుంచి గ్యాస్ సిలిండర్‌ను బయటకు తీసుకెళ్తున్న దృశ్యం అక్కడి దుస్థితికి అద్దం పడుతోంది. ముంపు నుంచి కాపాడుకోగలిగిన ఏకైక వస్తువు అదేనని బాధితులు చెబుతున్నారు. దెబ్బతిన్న ఇళ్లు, విరిగిపోయిన విద్యుత్ స్తంభాలు, పాడైపోయిన వాహనాలతో ఆయా ప్రాంతాలు భయానకంగా మారాయి.

**ఆర్మీ సహాయ శిబిరాలే ఆసరా**

త్రిశూలిలో ఏర్పాటు చేసిన ఆర్మీ రిలీఫ్ క్యాంప్ ప్రస్తుతం బాధితులకు అండగా నిలుస్తోంది. పిల్లలు, వృద్ధులకు ఆర్మీ సిబ్బంది సాయం అందిస్తున్నారు. తాత్కాలిక వైద్య శిబిరాల్లో వైద్యులు క్షతగాత్రులకు చికిత్స చేస్తున్నారు. గల్లంతైనవారు, మరణించినవారు, రక్షించబడిన వారి వివరాలను కూడా ఈ శిబిరాల నుంచే అందిస్తున్నారు. సహాయక చర్యల కోసం 5000 మందికిపైగా నేపాల్ ఆర్మీ సిబ్బందితోపాటు మొత్తం 11000 మందికిపైగా భద్రతా సిబ్బంది రంగంలోకి దిగారు. వాతావరణ శాఖ రానున్న రోజుల్లో సాధారణ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. దీంతో ఇప్పటికే బురద, శిథిలాలతో నిండిపోయిన ప్రాంతాల్లో సహాయక చర్యలు మరింత కష్టతరం కావచ్చని అధికారులు భావిస్తున్నారు. అయినప్పటికీ నేపాల్ ప్రభుత్వం గల్లంతైన వారి కోసం గాలింపు, బాధితులకు సహాయం, పునరావాసం, పునర్నిర్మాణంపై దృష్టి సారించింది. గత విపత్తుల అనుభవంతో సహాయక చర్యలను కొనసాగిస్తోంది. ప్రకృతి సృష్టించిన ఈ మహా విధ్వంసం నుంచి నేపాల్ కోలుకోవడానికి ఎంత సమయం పడుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

# ప్రాణహితకు పునరుజ్జీవం

(మొదటిపేజీ తరువాయి)

ఇంజినీర్ఇన్‌చీఫ్ (జనరల్) ఓ.వి.రమేష్‌బాబుతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఢిల్లీ సమావేశంలో తెలంగాణ తరఫున వినిపించాల్సిన సాంకేతిక, న్యాయపరమైన అంశాలు, 152 మీటర్ల బ్యారేజీతో కలిగే ప్రయోజనాలు, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, గురుత్వాకర్షణ ద్వారా నీటిని తరలించే సాధ్యాసాధ్యాలపై చర్చించారు.

**152 మీటర్లపై తెలంగాణ పట్టు**

గత రాష్ట్ర ప్రభుత్వం 2016లో అంగీకరించిన 148 మీటర్ల స్థాయికి బదులుగా 152 మీటర్ల స్థాయిలో తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర సమ్మతి పొందేందుకు ప్రయత్నిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) అధ్యయనాల ప్రకారం 148 మీటర్ల వద్ద మహారాష్ట్రలో సుమారు 1,150 ఎకరాలు, 152 మీటర్ల వద్ద 2,500 ఎకరాలకు పైగా ముంపునకు గురయ్యే అవకాశం ఉందని చెప్పారు. ముంపు అంశంపై మహారాష్ట్రతో చర్చలు తప్పనిసరైనప్పుడు తెలంగాణకు అధిక ప్రయోజనం కలిగించే 152 మీటర్ల స్థాయికి సమ్మతి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు మీటర్ల అదనపు స్థాయి వల్ల నీటి వినియోగం, తరలింపులో సాంకేతిక ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల స్థాయిలో బ్యారేజీ నిర్మాణం సాధ్యమైతే దాదాపు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను భారీ ఎత్తిపోతల అవసరం లేకుండా సహజ గురుత్వాకర్షణతో సుందిళ్ల బ్యారేజీ వరకు తరలించే అవకాశం ఉంటుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దీనివల్ల నీటిని ఎత్తిపోసేందుకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం, నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. గురుత్వాకర్షణ ఆధారిత నీటి తరలింపు వల్ల సాగునీటి వ్యవస్థ మరింత ఆర్థికంగా, విశ్వసనీయంగా మారుతుందని వివరించారు. ప్రాణహిత ప్రతిపాదనకు 1975, 1978 అంతర్రాష్ట్ర ఒప్పందాలు న్యాయ, సంస్థాగత పునాదిగా ఉన్నాయని మంత్రి తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలు ప్రాణహిత ప్రాజెక్టును పరస్పర ప్రయోజనాల కోసం అభివృద్ధి చేసుకునేందుకు అప్పట్లో ఈ ఒప్పందాలు అవకాశం కల్పించాయని గుర్తుచేశారు.

**కోల్పోయిన ఆయకట్టుకు జలభరోసా**

అసలు ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి పథకం సుమారు 16.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో రూపొందిందని మంత్రి తెలిపారు. అనంతరం ప్రాజెక్టు పునరాకల్పన, పునర్వ్యవస్థీకరణలో అసలు ఆయకట్టులోని గణనీయమైన ప్రాంతాలు సాగునీటి ప్రయోజనాలకు దూరమయ్యాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని దాదాపు రెండు లక్షల ఎకరాలకు సమర్థమైన సాగునీటి వనరు లేకుండా పోయిందన్నారు. ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాల్లోని చివరి ఆయకట్టు ప్రాంతాలు కూడా అసలు ప్రాణహిత-చేవెళ్ల పథకంలో భాగంగా ఉన్నాయని చెప్పారు. పునరాకల్పనలో కీలక ప్యాకేజీలు తొలగిపోవడంతో ఆయా ప్రాంతాలు సాగునీటి వనరును కోల్పోయాయని తెలిపారు. "ప్రాణహిత పునరుజ్జీవనం అంటే కేవలం ఒక బ్యారేజీ నిర్మించడం కాదు. సాగునీటి హామీ కోల్పోయిన ఆదిలాబాద్, మెదక్, రంగారెడ్డి ప్రాంతాలకు తిరిగి జలభరోసా కల్పించడం" అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సెప్టెంబరు 1న జరిగే సమావేశంలో బ్యారేజీ స్థాయి, ముంపు ప్రభావం, సాంకేతిక సాధ్యాసాధ్యాలు, అంతర్రాష్ట్ర అంశాలపై సమగ్రంగా చర్చిస్తామని తెలిపారు. మహారాష్ట్రతో సానుకూలంగా, నిర్మాణాత్మకంగా చర్చలు జరుపుతూనే తెలంగాణకు న్యాయబద్ధంగా దక్కాల్సిన జల ప్రయోజనాల విషయంలో రాజీపడబోమని స్పష్టం చేశారు. "తెలంగాణకు న్యాయబద్ధంగా దక్కాల్సిన ప్రతి నీటి చుక్కను కాపాడటం మా ప్రభుత్వ బాధ్యత. భారీ ఎత్తిపోతలపై ఆధారాన్ని తగ్గించి, విద్యుత్ వ్యయభారాన్ని తగ్గిస్తూ గరిష్ఠ ఆయకట్టుకు సాగునీరు అందించడమే లక్ష్యం" అని మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

# రెండో రోజూ ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ లాటరీ

- 1,920 ఇళ్లకు కేటాయింపులు..ఆన్‌లైన్‌లో ఎంపికైన వారి వివరాలు
- నాలుగు నియోజకవర్గాల్లో పారదర్శకంగా ప్రక్రియ
- అభ్యంతరాలు, ఫిర్యాదులకు అవకాశం
- విపి గౌతమ్, హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకం లాటరీ ప్రక్రియలో భాగంగా రెండో రోజు శనివారం 1,920 ఇళ్లను కేటాయించారు. ఖైరతాబాద్, కూకట్‌పల్లి, బహదూర్‌పుర, అంబర్‌పేట నియోజకవర్గాల్లో నిర్మించనున్న ఇళ్లకు ఆయా ప్రాంతాల్లోని ఫంక్షన్ హాళ్లలో లాటరీ నిర్వహించారు. అధికారులు, దరఖాస్తుదారుల సమక్షంలో ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 16 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టు కింద నిర్మించనున్న ఇళ్లకు డిమాండ్ సర్వే ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. ప్రాథమిక అర్హతల నిర్ధారణ అనంతరం అర్హులను లాటరీ ద్వారా ఎంపిక చేస్తున్నారు. ఆగస్టు 28 నుంచి 31 వరకు జరిగే లాటరీ ప్రక్రియను శుక్రవారం రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. మూడో రోజు ఆదివారం శేరిలింగంపల్లి, మలక్‌పేట, మేడ్చల్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు సంబంధించిన లాటరీ నిర్వహించనున్నారు. లాటరీలో ఎంపికైన వారి వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ విపి గౌతమ్ తెలిపారు. ఎంపికైన వారి వివరాలను అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని చెప్పారు. దరఖాస్తుల సమయంలో ఎలాంటి ధ్రువపత్రాలు స్వీకరించనందున, దరఖాస్తుదారులు సమర్పించిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో నిర్ధారించేందుకు ఈ పరిశీలన చేపడుతున్నట్లు వివరించారు. ఎంపికైన వారి విషయంలో ఏవైనా అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే తెలియజేసే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. అర్హులైన వారికే ఇళ్ల కేటాయింపు జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎలాంటి అపోహలు, అనుమానాలకు తావులేదని స్పష్టం చేశారు.

# హైదరాబాద్ రెస్టారెంట్లలో టీజీ సేఫ్ తనిఖీలు

- ఏడు రెస్టారెంట్లలో ఆహార భద్రత ఉల్లంఘనలు
- 11 నమూనాలు సేకరణ

**కాకతీయ, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో తెలంగాణ రాష్ట్ర ఆహార, అవసరమైన ఔషధాల ప్రమాణాల అథారిటీ (టీజీ సేఫ్) ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. ఆరు బృందాలతో చేపట్టిన ఈ తనిఖీల్లో ఏడు రెస్టారెంట్లలో ఆహార భద్రత నిబంధనల ఉల్లంఘనలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో ఆహార భద్రత అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. బంజారాహిల్స్‌లోని చట్నీస్, స్పైస్ 6, ఓహ్రీస్, జూబ్లీహిల్స్‌లోని ది స్పైసీ వేదిక, టోలిచౌకిలోని 4 సీజన్స్ మల్టీకుయిజిన్ రెస్టారెంట్, షా ఘౌస్, గచ్చిబౌలిలోని పిస్తా హౌస్ రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలను అధికారులు పరిశీలించారు. ఉల్లంఘనలకు సంబంధించి



కలుషితమయ్యే అవకాశం ఉన్న ఆహార పదార్థాల నుంచి 11 నమూనాలను సేకరించారు. నాలుగు మెరుగుదల నోటీసులు, మూడు కారణాలు చూపు నోటీసులు జారీ చేశారు. రెస్టారెంట్లు తప్పనిసరిగా ఆహార భద్రతా ప్రమాణాలను పాటించాలని అధికారులు సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా తనిఖీలు, నిబంధనల అమలును మరింత కఠినతరం చేస్తామని టీజీ సేఫ్ స్పష్టం చేసింది.

# ఇందిరానగర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

- ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం
- మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**కాకతీయ, వరంగల్ బ్యూరో:** హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి మండలం ఇందిరానగర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కరిస్తానని తెలిపారు. 'పల్లె పల్లెకు పొన్నం అన్న.. పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామంలో పర్యటించారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.

**సంక్షేమ పథకాలతో లబ్ధి**

గ్రామంలో 44 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, చాలా వరకు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. 96 మందికి పెన్షన్ల కోసం నెలకు



రూ.6.32 లక్షలు, 66 కుటుంబాలకు గృహ జ్యోతి కింద ఉచిత విద్యుత్ అందుతోందన్నారు. 41 మహిళా సంఘాలకు రూ.6.20 కోట్ల రుణాలు, 52 మంది రైతులకు రూ.37.61 లక్షల రుణమాఫీ, 235 మందికి రూ.93.04 లక్షల రైతుభరోసా అందినట్లు వివరించారు.

**సమన్వయంతో అభివృద్ధి**

సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. అర్హులైన వారు ఈ నెల 31లోగా పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, 3 కిలోవాట్ల సోలార్ వ్యవస్థకు రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాలు, యువత, ప్రజలు సమష్టిగా పనిచేస్తే గ్రామాభివృద్ధి సాధ్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## మృతుల కుటుంబాలకు చల్లా పరామర్శ..



**కాకతీయ, పరకాల:** ఇటీవల కాలంలో వివిధ కారణాలతో మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. పరకాల నియోజకవర్గ పరిధిలోని పరకాల పట్టణంతో పాటు నాగారం, వెంకటాపూర్ గ్రామాల్లో మృతి చెందిన చిట్టిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, చిట్టిరెడ్డి మల్లారెడ్డి, కుక్కల నర్సయ్య, గుజ్జ నారాయణరావు కుటుంబాలను పరామర్శించారు. అలాగే పరకాల పట్టణానికి చెందిన జర్నలిస్ట్ ఓదెల శివ తండ్రి బిక్షపతి మృతిచెందడంతో ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. బిక్షపతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ గొర్రెకుంట గ్రామానికి చెందిన నమిండ్ల కనకయ్య కుటుంబ సభ్యులను కూడా చల్లా ధర్మారెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, కష్టకాలంలో వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆసపత్రి పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాలతో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు
- పనులను పర్యవేక్షించిన సర్పంచ్ గారె సహేంద్ర బిక్షపతి, కార్యదర్శి యాకూబ్ నాయక్



**కాకతీయ,రాయపర్తి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) ప్రాంగణంలో పరిశుభ్రతను పెంపొందించడంపై రాయపర్తి గ్రామపంచాయతీ ప్రత్యేక దృష్టి సారించింది.ఉత్తరం కాకతీయ దినపత్రికలో ఆగస్టు 22న 'పేరుకే 24 గంటల ఆసుపత్రి' శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది.దీనిపై తక్షణమే స్పందించిన వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆగస్టు 26 బుధవారం ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ క్రమంలో ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం,పిచ్చి మొక్కలు పెరిగి ఉండడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రోగులకు మెరుగైన వైద్యంతో పాటు ఆహ్లాదకరమైన,పరిశుభ్రమైన వాతావరణం అందించాలని,తక్షణమే పరిసరాలను శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు.కలెక్టర్ ఆదేశాల మేరకు స్పందించిన రాయపర్తి గ్రామ సర్పంచ్ గారె సహేంద్ర బిక్షపతి,కార్యదర్శి యాకుబ్ నాయక్ శనివారం పారిశుద్ధ్య సిబ్బందితో కలిసి ఆసుపత్రి వద్ద పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశారు. ఆస్పత్రి ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని,పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు.ఈ సందర్భంగా సర్పంచ్,కార్యదర్శి మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే తమ లక్ష్యమని అన్నారు.కలెక్టర్ సూచనల మేరకు పారిశుద్ధ్య పనులు వేగవంతం చేశామని తెలిపారు.రాబోయే రోజుల్లో కూడా ఆసుపత్రి పరిసరాల్లో అపరిశుభ్రత చేరకుండా క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అనంతరం రాత్రి వేళలో రోగులకు,ఆసుపత్రి సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నూతనంగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది,ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తోనే ఇనుగుర్తి అభివృద్ధి

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు బైరు అశోక్ గౌడ్



**కాకతీయ, ఇనుగుర్తి:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తోనే కొత్తగా ఏర్పడిన ఇనుగుర్తి మండలం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బైరు అశోక్ గౌడ్ అన్నారు. తహసిల్దార్ కార్యాలయం అధునాతన హంగులతో ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం రూ.2 కోట్ల 10 లక్షలు మంజూరు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రం ఇనుగుర్తిలో శనివారం సీఎం రేవంత్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు (ఎంపీ)వేం నరేందర్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన ఇనుగుర్తి మండలంలో గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ సొంత కార్యాలయాలు లేకపోవడం పట్ల నాయకుల అభ్యర్థన మేరకు ప్రజావాసరాలను గుర్తించిన ప్రభుత్వం భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించిందన్నారు. రానున్న రోజుల్లో ఇతర కార్యాలయాల నిర్మాణం తో పాటు మండలాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. నిధుల విడుదలకు కృషిచేసిన వేం నరేందర్ రెడ్డి,బలరాం నాయక్, మురళీ నాయక్ కు మండల పార్టీ తరపున, మండల ప్రజల తరపున అశోక్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక గ్రామ పార్టీ అధ్యక్షులు గంజి రాజేందర్ రెడ్డి, సర్పంచి తమ్మడపల్లి కుమార్, ఉపసర్పంచి సత్తురి యాదగిరి, దిశా కమిటీ సభ్యుడు గుజ్జునూరి బాబురావు, మాజీ మండల అధ్యక్షులు సతీష్, వివిధ గ్రామాల సర్పంచులు ముదిరెడ్డి కళావతి శ్రీనివాస్ రెడ్డి, ఇస్లావత్ నరేష్, చెడుపాక సుజాత యాకయ్య, భూక్య చిన్ని వెంకన్న, కాంగ్రెస్ జిల్లా మండల గ్రామ నాయకులు కాలేరు శివాజీ, నారాయణ, దేవులపల్లి వెంకన్న, మలిశెట్టి శ్యామ్, రామ్ సలీం,కొణతం రాము,వీరన్న,సూర్య నాయక్,వెంకన్న, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ లో ఘనంగా స్పోర్ట్స్ డే వేడుకలు

**యువతరం మానసిక శారీరక దృఢత్వం కలిగి ఉండాలి**





**కాకతీయ, నెల్లికుదురు :** క్రీడలతోనే యువతరం మానసిక శారీరక ంగా దృఢత్వం కలిగి ఉంటారని ప్రిన్సిపాల్ ఉపేందర్ రావు అన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం మేజర్ ధ్యాన్ చంద్ జయంతి వేడుకలు పురస్కరించుకొని ఫిజికల్ డైరెక్టర్ ఓర్సు కొమురయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ ఉపేందర్ రావు పాల్గొని మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ స్పోర్ట్స్ కు మరియు సైనికుడిగా విశిష్ట సేవలు అందించి భారతదేశ పతాకాన్ని ఒలంపిక్స్ లో రెపరెపలాడించి వరుసగా 1928 నుండి 1936 వరకు మూడు బంగారు పథకాలను అందించిన మొట్ట మొదటి హాకీ క్రీడా ఆయనని మేజర్ ధ్యాన్ చంద్ ఫిజికల్ ఫిట్ మెంటల్లీ హెల్త్ సోషల్ వెల్బీ ఎమోషనల్ బ్యాలెన్స్డ్ నేటి యువతరం మానసిక దృఢత్వాన్ని శారీర దృఢత్వాన్ని పైపొందించుకొని ముందుకెళ్లాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల బకాయిలు విడుదల చేయాలి

- రూ.15 వేల కోట్ల బకాయిలతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారం
- 40 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం
- జీవో 97ను రద్దు చేసి.. ఆయుష్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి
- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్





**కాకతీయ, వరంగల్:** తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు పిలుపు మేరకు శనివారం వరంగల్ చౌరస్తాలో బీజేవైఎం జిల్లా ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, వాటిని విడుదల చేయకపోవడంతో దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల జీవితాలు ఇబ్బందుల్లో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖకు మంత్రి కూడా లేకపోవడం దురదృష్టకరమన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్న జీవో 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆయుష్ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే తెలంగాణలో తక్కువ స్టైపెండ్ ఇస్తున్నారని విమర్శించారు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును గృహ నిర్బంధం చేయడం, నిరసనలను అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. ఫీజుల బకాయిలు విడుదల చేసే వరకు పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎర్రగొల్ల భరత్‌వీర్, పలువురు బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పన్ను వసూళ్లలో వేగం పెంచండి

- టాప్ డిఫాల్టర్లపై ప్రత్యేక దృష్టి
- దీర్ఘకాల బకాయిలకు ఆర్ఆర్ చట్టం ప్రకారం చర్యలు
- లక్ష్య సాధనలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు : కమిషనర్ టి. వెంకన్న



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** గ్రేటర్ వరంగల్ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. శనివారం ప్రధాన కార్యాలయంలో ట్యాక్సేషన్, రెవెన్యూ అధికారులతో సర్కిళ్ల వారీగా సమీక్ష నిర్వహించారు. సర్కిల్, వార్డు స్థాయిలో లక్ష్యాలను విభజించి రోజువారీ పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. కొత్త అసెస్‌మెంట్లు, పెండింగ్ బకాయిలు, వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్‌టీ), డబుల్ అసెస్‌మెంట్లు, కమర్షియల్ భవనాలను గుర్తించేందుకు సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించాలని కమిషనర్ సూచించారు. పెద్ద మొత్తంలో బకాయిలున్న టాప్ డిఫాల్టర్లపై ప్రత్యేక దృష్టి సారించి, దీర్ఘకాల బకాయిలకు ఆర్ఆర్ చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఖాళీ ప్లాట్‌ను గుర్తించి నిబంధనల ప్రకారం వీఎల్‌టీ వసూలు చేయాలని ఆదేశించారు. అపార్ట్‌మెంట్ల నిర్మాణం కోసం కూల్చిన భవనాల పాత హౌస్ నంబర్ల వివరాలను వెంటనే సమర్పించాలని సూచించారు. లక్ష్య సాధనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ టి. వెంకన్న హెచ్చరించారు. ఆస్తి పన్నుతోపాటు నీటి పన్ను బకాయిల వసూళ్లపైనా దృష్టి పెట్టాలని సూచించారు.

## మహేష్‌కుమార్ గౌడ్‌కు రాఖీ కట్టిన మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు



**కాకతీయ, హైదరాబాద్ :** రాఖీ పండుగను పురస్కరించుకొని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌కు తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ శుక్రవారం రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని మహేష్‌కుమార్ గౌడ్ నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వర్ణ మాట్లాడుతూ రక్షాబంధన్ మహిళల పట్ల గౌరవం, రక్షణ, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మహిళలకు అండగా నిలిచిందని పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మహిళా కాంగ్రెస్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. సోనియాగాంధీ ఆశయం, ప్రియాంకగాంధీ 'లడ్కీ హూఁ లడ్ సక్తీ హూఁ' నినాదం స్ఫూర్తిగా తెలంగాణలో మహిళలను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మహిళా కాంగ్రెస్ కృషి చేస్తుందని ఎర్రబెల్లి స్వర్ణ తెలిపారు. మహేష్‌కుమార్ గౌడ్ నాయకత్వంలో మహిళా కాంగ్రెస్ మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి
- ములుగు జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

**కాకతీయ, ములుగు ప్రతినిధి:** జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు అవసరమైన రోడ్డు భద్రతా చర్యలను పటిష్టంగా చేపట్టాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీహెచ్ మహేందర్‌జీ అధికారులను ఆదేశించారు. శనివారం నూతన కలెక్టరేట్‌లో తన ఛాంబర్‌లో రోడ్డు భద్రతా సమావేశం నిర్వహించారు. మల్లంపల్లి, పందికుంట, యువజన శిక్షణ కేంద్రం, జాకారం, నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంతాల్లో అవసరమైన చోట్ల వేగ నియంత్రణ పట్టీలు, సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతీయ రహదారికి అనుసంధానమయ్యే రహదారుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనుసంధాన ప్రాంతాల్లో వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఆర్టీవో ఈశ్వర్‌సింగ్ ఠాగూర్, జాతీయ రహదారులు, ఆర్అండ్‌బీ, పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు, ఎక్సైజ్ సీఐ సుధీర్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సంపత్, ఆర్టీసీ, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 4న వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- పార్టీలకు అతీతంగా ఉత్సవాలు
- కాళోజీ కళాక్షేత్రం వేదికగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంబరాలు
- యాదవ సంస్కృతి, సంప్రదాయాలను చాటేలా ప్రత్యేక కార్యక్రమాలు
- యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్



**కాకతీయ, హనుమకొండ:** శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా సెప్టెంబర్ 4న హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను వైభవంగా నిర్వహించనున్నట్లు యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రముఖులు హాజరుకానున్న ఈ వేడుకలకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం రాంనగర్‌లోని బీసీ భవన్‌లో గొల్ల, కురుమల సమక్షంలో జన్మాష్టమి వేడుకల వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నామని, ఈసారి కూడా ఘనంగా నిర్వహించనున్నట్లు సుందర్‌రాజ్ యాదవ్ చెప్పారు. యాదవుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పేలా కార్యక్రమాలు ఉంటాయన్నారు. భగవద్గీత ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచిందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 4న మధ్యాహ్నం 2 గంటలకు రాంనగర్ బీసీ భవన్ నుంచి కాళోజీ కళాక్షేత్రం వరకు రథయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం గోపూజ, శ్రీకృష్ణ భగవానుడికి తొట్లు ఊపే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే కళాకారులతో ఆటాపాట, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఉత్సవాలకు హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, రాజ్యసభ సభ్యుడు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు పార్టీలకు అతీతంగా హాజరవుతారని తెలిపారు. దేశవ్యాప్తంగా యాదవులను ఏకం చేసి భవిష్యత్తులో మరింత ఘనంగా వేడుకలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలువురు మాజీ కార్పొరేటర్లు, యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ప్రతినిధులు, అఖిలభారత యాదవ మహాసభ నాయకులు, మహిళా నాయకులు, యాదవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీరియస్‌గా పనిచేయండి.. మీ వెంట నేనుంటా

- కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్యాలపై బీఆర్ఎస్ పోరుబాట
- ప్రజా సమస్యలు, హామీల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బీఆర్ ఎస్ నేతలకు మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపు

**కాకతీయ, పెద్దవంగర:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ చేపట్టనున్న వారం రోజుల పోరుబాటను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని సాయి గార్డెన్‌లో నిర్వహించిన మండలస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను ప్రజలకు గుర్తుచేస్తూ.. వెయ్యి రోజులు గడిచినా అమలు కాని హామీలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలు, అవినీతి ఆరోపణలను ప్రజల ముందుంచి ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. సెప్టెంబరు 2 నుంచి ప్రారంభమయ్యే పోరుబాటలో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. హామీలను అమలు చేసే వరకు ప్రజల తరఫున బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సీరియస్‌గా పనిచేయండి.. మీ వెంట నేనుంటా. మిమ్మల్ని కాపాడే శక్తి నాకుంది.. పార్టీని మీరు కాపాడాలి అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, సీనియర్ నాయకులు, సర్పంచులు, గ్రామ, యువజన, సోషల్ మీడియా నాయకులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాలల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ
- పరిశీలన గృహంలో వసతులు, సేవలపై సమీక్ష
- బాలల సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్న పూజ



**కాకతీయ, వరంగల్ బ్యూరో :** బాలల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ సూచించారు. ఆటోనగర్‌లోని బాలుర పరిశీలన గృహాన్ని శనివారం సందర్శించిన ఆమె.. అక్కడి వసతులు, సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. వసతి గదులు, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, విద్య, వృత్తి శిక్షణ, కౌన్సెలింగ్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. బాలలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, అందుతున్న సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. భవిష్యత్తుపై సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ, ఉచిత న్యాయ సహాయంపై వారికి అవగాహన కల్పించాలని పరిశీలన గృహం సూపరింటెండెంట్ శ్రీదేవికి సూచించారు. విద్య, ఆరోగ్యం, మానసిక సహాయం, నైపుణ్యాభివృద్ధి, సామాజిక పునరావాసానికి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. అనంతరం రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించారు. బాలలకు సంబంధించిన వివరాలను నిబంధనల ప్రకారం పూర్తిస్థాయిలో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం, లోపాలు, జాప్యానికి తావులేకుండా చూడాలని సూచించారు. పరిశుభ్రత, ఆహార నాణ్యత, విద్య, వైద్యం, కౌన్సెలింగ్, భద్రత, మౌలిక సదుపాయాల్లో అవసరమైన మెరుగుదలలు చేపట్టాలని ఆదేశించారు. సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరఫున సహకారం అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి పూజ తెలిపారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఆర్.రజినీ, పరిశీలన గృహం సిబ్బంది పాల్గొన్నారు.



## జర్నలిస్ట్ భాస్కర్ కు అండగా డీసీసీ అధ్యక్షుడు

- ఎల్‌ఓసీ ద్వారా ఉచిత వైద్యానికి చర్యలు

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** వరంగల్ తూర్పు సీనియర్ జర్నలిస్ట్ వనం భాస్కర్ నిమ్స్ లో చికిత్స పొందుతుండగా, డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ చొరవతో ఎల్‌ఓసీ ద్వారా ఉచిత వైద్యం అందేలా ఏర్పాట్లు చేశారు. అయూబ్ మాట్లాడుతూ భాస్కర్ గారు త్వరగా కోలుకోవాలి. జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది. వరంగల్ తూర్పు జర్నలిస్టులు నా ఎదుగుదలకు ఎంతో సహకరించారు, వారికి ఎల్లప్పుడూ నా వంతు సహాయం చేస్తానని తెలిపారు.

## నీట్-పీజీ పరీక్ష కేంద్రాల వద్ద ఆంక్షలు

- 500 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుమిగూడొద్దు
- సభలు, ర్యాలీలు, మైకులు, డీజేలకు అనుమతి లేదు
- పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు, ప్రత్యేక నిఘా
- ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు: కమిషనర్ ఎన్.శ్వేత



**కాకతీయ, వరంగల్ బ్యూరో:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం నిర్వహించనున్న నీట్‌పీజీ 2026 పరీక్షల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్2023 అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 30న ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 500 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని సూచించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, ప్రచార కార్యక్రమాలతో పాటు మైకులు, డీజేలు వినియోగించడం, ఊరేగింపులు చేపట్టడంపై నిషేధం విధించినట్లు తెలిపారు. పరీక్షల సమయంలో కేంద్రాల పరిసరాల్లోని ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ కేంద్రాలు, స్టేషనరీ దుకాణాలను మూసివేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పోలీస్ పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేశామని, అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని చెప్పారు. ముందస్తు సమాచారాన్ని సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు, ప్రజలు, రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్ హెచ్చరించారు.



నన్ను తొక్కాలని సొంత పార్టీలోనూ చూశారు. పార్టీ మారితే కేసులు మాఫీ చేస్తామన్నారు. అయినా కాంగ్రెస్ కండువా తప్ప మరో కండువా నా మెడలో ఉండదని తేల్చిచెప్పా" అని ఆయన తన రాజకీయ ప్రయాణంలోని కీలక ఘట్టాలను గుర్తుచేసుకున్నారు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి. సెయింట్ జాన్స్ స్కూల్‌లో మొదలైన అల్లరి.. జెండా దగ్గర జరిగిన తొలి పోరాటంతో వచ్చిన గుర్తింపు.. చదువు అబ్బక బర్లు కాయడానికి పంపిస్తానన్న తండ్రి హెచ్చరిక.. ఇంటర్‌లోనే పోలీస్ కేసు.. కిన్నెర హోటల్ వద్ద సాగిన విద్యార్థి రాజకీయాలు.. డిగ్రీలో ఎన్ఎస్‌యూఐ అధ్యక్ష పదవి.. యూత్ కాంగ్రెస్ నుంచి మొదలైన రాజకీయ మలుపులు.. టికెట్ కోసం సాగిన సుదీర్ఘ నిరీక్షణ.. చివరకు ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టిన ప్రయాణం. మధ్యలో 54 కేసులు, మర్డర్ కేసులో ఇరికించే ప్రయత్నాలు, పార్టీ మారితే కేసులు మాఫీ చేస్తామన్న ప్రలోభాలు.. అయినా కండువా మార్చని పట్టుదల. రాహుల్‌గాంధీ నుంచి నేరుగా వచ్చిన ఫోన్ నుంచి రేవంత్‌రెడ్డితో టికెట్ కోసం చేసిన పోరాటం వరకు నా జీవితంలో ఎన్నో మలుపులు. దాట్లలో మొదలైన కుటుంబ కథ నుంచి వరంగల్ బ్రాండ్‌ను పెంచాలన్న లక్ష్యం వరకు.. నా జీవితంలో ప్రతి మలుపూ ఓ పోరాటమే. కాలం మారింది.. రాజకీయాలు మారాయి.. అప్పటి రాజకీయ సంస్కారం మాత్రం తిరిగి రావడం లేదన్నదే నా బాధ అంటూ నాయిని రాజేందర్ రెడ్డి తన గతాన్ని గుర్తు చేసుకున్నారు. . విద్యార్థి దశలో మొదలైన పోరాట స్వభావమే తన రాజకీయ జీవితానికి పునాదిగా మారిందని, చివరకు ఎమ్మెల్యేగా అసెంబ్లీలో కూర్చోవాలన్న తన కలను సాకారం చేసుకున్నానని వెల్లడించారు. శనివారం డిజిటల్ మీడియా ప్రతినిధులతో తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన చిట్‌చాట్‌లో అనేక ఆసక్తికర అంశాలను వెల్లడించారు. ఆ వివరాలను ఆయన మాటల్లోనే..!

### రాహుల్‌గాంధీ ఫోన్.. నాకది గర్వకారణం

ఒకరోజు కారులో హైదరాబాద్‌కు వస్తుండగా రాహుల్‌గాంధీ నుంచి నేరుగా ఫోన్ వచ్చింది. ఢిల్లీకి రావాలని పిలిచారు. దేశవ్యాప్తంగా 10 జిల్లాలను ఎంపిక చేసి సమావేశానికి పిలిస్తే తెలంగాణ నుంచి నన్ను ఒక్కరినే పంపించారు. నాకు 45 నిమిషాల సమయం ఇచ్చారు. డీసీసీలకు మరిన్ని అధికారాలు ఇవ్వాలని అప్పుడే సూచించాను. ఇప్పుడు రాహుల్‌గాంధీ వాటిని అమలు చేస్తున్నారు. మరోసారి రాహుల్‌గాంధీ, కొప్పుల రాజు ఆన్‌లైన్‌లో డీసీసీ సమావేశం నిర్వహించారు. అందులో మాట్లాడమన్నవారే మాట్లాడాలి. అప్పుడు రాహుల్‌గాంధీ నాయిని రాజేందర్‌రెడ్డి జీ మాట్లాడండి అని నన్ను పిలిచారు. అది నాకు ఎంతో గర్వంగా అనిపించింది.

### నాన్నను డబ్బులు అడగడం మానేశా.. పిల్లనూ ఇవ్వలేదు

ఇంటర్‌లో చదువు అబ్బడం లేదని, బిజినెస్ చేసుకుంటానని డబ్బులు ఇవ్వమని నాన్నను అడిగాను. ఆయన ఇవ్వనని చెప్పారు. అప్పటి నుంచి నాన్నను డబ్బులు అడగడమే మానేశాను. నా మీద రెండు కేసులు నమోదైన తర్వాత నరేందర్‌రెడ్డి పెద్ద కొడుకుపై మర్డర్ కేసు అయిందట అంటూ ప్రచారం జరిగింది. చుట్టాలు, పక్కాలు కూడా అదే మాట్లాడుకునేవారు. అప్పట్లో పట్టింపులు ఎక్కువ. కేసులు ఉన్నాయనే కారణంతో నాకు పిల్లను ఇవ్వడానికి కూడా ఎవరూ ముందుకు రాలేదు.

### 'దక్కమొక్కిలు... తింటేనే జీవితం తెలుస్తుంది'

నేను హైస్పీడ్, టఫ్‌గా ఉంటాను. ఒకసారి స్నేహితులతో కలిసి ఐదు బైక్‌లపై ఢిల్లీ వెళ్లాలని ప్లాన్ చేశాం. ఆ విషయం అమ్మకు చెప్పినా ఆమె అడ్డుచెప్పలేదు. తర్వాత ఎందుకు అడ్డుచెప్పలేదని అడిగాను. అందుకు ఆమె, దక్కమొక్కిలు తింటూ పెరిగితేనే జీవితంలో అన్నీ తెలుస్తాయి అని చెప్పింది. ఆ మాట నాకు చాలా నచ్చింది. నిజమే.. జీవితంలో ఎదురయ్యే దెబ్బలు, కష్టాలు, పోరాటాలే మనిషికి అన్నీ నేర్పిస్తాయి. రాజకీయాల్లో అడుగుపెట్టినప్పటి నుంచి నా ప్రయాణం దాడులు, ప్రతిదాడులు, కేసులు, పోరాటాలతోనే సాగింది. విద్యార్థి దశలో ఎన్ఎస్‌యూఐ కోసం తలపడ్డాను. రాజకీయాల్లో ఘర్షణలు, కేసులు ఎదుర్కొన్నాను. సొంత పార్టీలోనే తొక్కే ప్రయత్నాలు జరిగాయి. పార్టీ మారితే కేసులు మాఫీ చేస్తామన్న ప్రలోభాలు వచ్చినా లెక్కచేయలేదు. పోరాటమే నా రాజకీయ ప్రస్థానానికి పునాది. అదే నా బలం.

### అప్పటి రాజకీయాల్లో ప్రత్యర్థికీ గౌరవం ఉండేది

అప్పటి రాజకీయాలు వేరు. ఇప్పుడు రాజకీయాల్లో విలువలు తగ్గుతున్నాయి. ప్రత్యర్థిని కూడా గౌరవించే సంస్కారం అప్పట్లో ఉండేది. నర్సంపేట ఎమ్మెల్యేగా పనిచేసిన ఓంకార్‌పై ఫైర్ కావడంతో ఆయనను ఎంజీఎంకు తీసుకొచ్చారు. నర్సంపేట నుంచి ఇసుకేస్తే రాలనంత జనం వచ్చారు. రాజకీయాల్లో హత్యలు జరిగిన కాలమే అది. హయగ్రీవాచారిని ప్రత్యర్థులు హత్యలాచారి అని పిలిచేవారు. అయినా ఆయన ఎంజీఎంకు వెళ్లి ఓంకార్‌ను పరామర్శించారు. అంతా మాపై దాడి చేస్తారనుకున్నాం. కానీ ఆయనను చూసి అంత మంది దారి ఇవ్వడం నాకు గొప్పగా అనిపించింది. ఇప్పుడు ఎవరో పోటీకి వస్తాడేమోనని ముందే శత్రువుగా చూస్తున్నారు. కానీ అప్పుడున్న రాజకీయ సంస్కారం ఇప్పుడు మచ్చుకైనా కనిపించడం లేదు.

### దాట్ల నుంచి హన్మకొండకు..

మా అమ్మానాన్న జయమాల, నరేందర్‌రెడ్డి తొర్రూరు మండలం దాట్లలో ఉండేవారు. ఇప్పటికీ అక్కడ మా కుటుంబానికి భూములున్నాయి. నాన్నకు పెళ్లైన కొద్దిరోజుల తర్వాతనే హన్మకొండకు షిఫ్ట్ అయ్యారు. నేను మిషన్ ఆస్పత్రిలో పుట్టాను. నాకు తమ్ముడు ఉన్నాడు. మా కుటుంబంలో ఇంతకుముందు ఎవరూ రాజకీయాల్లో లేరు. నేను రాజకీయాల్లోకి రావడం పూర్తిగా నా ప్రయాణమే. చిన్నప్పటి నుంచే నేను కొంచెం రఫ్‌గా, హైస్పీడ్‌గా ఉండేవాడిని. జీవితంలో ఎదురైన ప్రతి అనుభవం నన్ను ఒక్కో మెట్టు ఎక్కించింది. సెయింట్ జాన్స్ స్కూల్‌లో నా చదువు మొదలైంది. ఆ తర్వాత నాన్న నన్ను గౌతమ్ ప్రాక్టిసింగ్ స్కూల్‌లో ఇంగ్లిష్ మీడియంలో చేర్పించారు. ఏడో, ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడు ఒక ఆగస్టు 15న మా స్కూల్లో జెండా వందనానికి ఏర్పాట్లు చేశారు. అదే సమయంలో ముగ్గురు వ్యక్తులు వచ్చి త్రివర్ణ పతాకం వద్దని, బ్లాక్ జెండా పెడతామని అన్నారు. ప్రిన్సిపాల్ అంగీకరించకపోవడంతో చిన్నపాటి పెనుగులాట జరిగింది. ప్రిన్సిపాల్ కిందపడటంతో నేను వెంటనే వారితో ఫైటింగ్‌కు వెళ్లాను. ఆ ఘటన తర్వాత స్కూల్లో నా క్రేజ్ పెరిగింది. సార్లు నన్ను ప్రత్యేకంగా చూస్తుంటే నాకు భలే అనిపించేది. అయితే చదువు మాత్రం నాకు ఎప్పుడూ అబ్బలేదు. స్కూల్ బంద్ కొట్టి సినిమాలకు వెళ్లేవాడిని. సత్యనారాయణ అనే మంచి టీచర్ ఉండేవారు. మేము థియేటర్‌కు వెళ్లామని తెలిసి అక్కడికే వచ్చి క్లాస్‌రూమ్‌కు తీసుకొచ్చేవారు.

# పోరాటమే నా బలం

## నా రాజకీయ ప్రస్థానానికి అదే పునాది

దాట్లలో మా మూలాలు.. హన్మకొండలో నా బాల్యం

జెండా దగ్గరే మొదటి పోరాటం.. కాలేజీలో తొలి కేసు

కిన్నెర మా అడ్డా.. ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా ఎదిగాను

యూత్ కాంగ్రెస్‌తో రాజకీయ మలుపు.. టికెట్ కోసం సుదీర్ఘ పోరాటం

రేవంత్‌రెడ్డితో మళ్లీ పోరాటం.. కేసులైనా కండువా మార్చలేదు

రాహుల్ నుంచి నేరుగా ఫోన్.. రాజకీయాల్లో అది మరిచిపోలేని గౌరవం

వరంగల్ బ్రాండ్ పెంచడమే లక్ష్యం..

డిజిటల్ మీడియా ప్రతినిధులతో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చిట్‌చాట్



### కాలేజీలో పోరాటాలు..

చదువంటే నాకు చిన్నప్పటి నుంచే ఆసక్తి ఉండేది కాదు. బలవంతంగా చదివినా కష్టంగా పాస్ అయ్యేవాడిని. ఒకసారి పరీక్షలో సున్నా మార్కులు వచ్చాయి. నాన్న ముందు నన్ను తిడుతూ, వీడు చదవడు.. బర్లు కాయడానికి పంపిస్తా అన్నాడు. నాన్న నిజంగానే పంపిస్తాడేమో అనుకుని నేను కూడా అక్కడ పతంగులు ఎగురేసుకోవచ్చని సిద్ధమయ్యా. అది చూసిన కొంత షాక్‌కు గురైన నాన్న మళ్లీ నన్ను తిట్టాడు. డిగ్రీలోనూ లెక్చరర్లు ఎంత కష్టపడినా నేను పాస్ కాలేకపోయాను. పుస్తకం అంటేనే పడకపోయేది. కానీ కాలేజీకి వచ్చేసరికి నా దృష్టి పూర్తిగా మరో వైపు మళ్లింది. హన్మకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివేటప్పుడు నా స్నేహితులు సీకేఎం కాలేజీలో ఎన్ఎస్‌యూఐ తరఫున బ్యానర్లు కట్టేందుకు వెళ్లారు. వారిపై ఏబీవీపీ కార్యకర్తలు దాడి చేసి బురదలో పడేసి కొట్టారు. మరుసటి రోజు నేను 18 మందితో అక్కడికి వెళ్లాను. అక్కడ 100 మందికిపైగా ఉన్నారు. వెనక్కి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఘర్షణ జరిగింది. కేసులు నమోదయ్యాయి. అది నా జీవితంలో మొదటి కేసు. అప్పట్లో బస్వరాజు సారయ్య పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడి మమ్మల్ని కొట్టకుండా కాపాడారు.

### 'పని చేసే అధ్యక్షుడు'గా ఎనిమిదేళ్లు

ఆ తర్వాత కాంగ్రెస్ వరంగల్ సిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నన్ను, పుల్లా భాస్కర్‌ను అధ్యక్షుడిగా ప్రకటించారు. అప్పటి జిల్లా ఇన్‌చార్జి నన్ను సరదాగా పని చేసే అధ్యక్షుడు అని పిలిచేవారు. హయగ్రీవాచారి, తోకల దేవేందర్‌రెడ్డి నా రాజకీయ గురువులు. వారి నీడలోనే రాజకీయంగా ఎదిగాను. సిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎనిమిదేళ్లు పనిచేశాను. 2005లో లైబ్రరీ చైర్మన్‌గా ఉన్నాను. 2014లో పొన్నాల లక్ష్మయ్య పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో డీసీసీగా పనిచేశాను. కాకతీయ ఆటో యూనియన్, మెడికల్ అండ్ హెల్త్ తదితర సుమారు 20 సంఘాలకు గౌరవ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించాను. అసెంబ్లీ టికెట్ కోసం 2004 నుంచే ప్రయత్నించాను. 2004లో టీఆర్ఎస్–కాంగ్రెస్ పొత్తులో వరంగల్ పశ్చిమ సీటు టీఆర్ఎస్‌కు వెళ్లి సత్యనారాయణరెడ్డికి టికెట్ వచ్చింది. 2009లో దయాసాగర్, 2012 బై ఎలక్షన్‌లో దయాసాగర్‌కు, 2014లో ఎర్రబెల్లి స్వర్ణ, 2018లో మహాకూటమి అభ్యర్థిగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి బరిలో నిలిచారు. దీంతో నాకు టికెట్ వచ్చినట్లే వచ్చి చేజారిన సందర్భాలున్నాయి. 2009లో రాహుల్‌గాంధీ యూత్ కాంగ్రెస్ కోటాలో నాకు టికెట్ ఖరారైంది. బక్క జడ్సన్ నా ఫోన్ నుంచి దరఖాస్తు చేశారు. జితేందర్‌సింగ్ నుంచి మీకు టికెట్ కన్ఫాం అంటూ మెసేజ్ వచ్చింది. అర్థం కాక ఆ నంబర్‌కు ఫోన్ చేస్తే ఢిల్లీ నంబర్ అని తెలిసింది. ఢిల్లీ వెళ్లి టికెట్ విషయం నిర్ధారించుకున్నాను. యూత్ కోటాలో నాతో పాటు ఏడుగురికి టికెట్లు కేటాయించారు. కానీ ఢిల్లీలో జరిగిన మంతనాల తర్వాత నా టికెట్ తీసేశారు. ఇదేంటని అడిగితే వైఎస్ నా భుజంపై చేయి వేసి చెప్పకనే చెప్పారు. ఆ బాధ నాకు ఇప్పటికీ గుర్తుంది.

### కిన్నెర హోటల్ నుంచి ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడి వరకు

పబ్లిక్ గార్డెన్ సమీపంలోని కిన్నెర హోటల్ మా అడ్డా. ఎన్ఎస్‌యూఐ, ఏబీవీపీ కార్యకర్తల అడ్డాలు అక్కడే ఉండేవి. కోహినూర్ హోటల్ వద్ద మరో సంఘం ఉండేది. దేశంలో ఎక్కడా లేని విధంగా అప్పట్లో హన్మకొండలో ఎన్ఎస్‌యూఐ, ఏబీవీపీ కార్యాలయాలు పక్కపక్కనే ఉండేవి. కార్యాలయాల్లో బియ్యం బస్తాలు తెచ్చి పెట్టుకునే పరిస్థితి. రాత్రివేళ రామకృష్ణ పరమహంస అనే డీఎస్పీ నలుగురు పోలీసులను సెక్యూరిటీగా పంపేవారు. యుద్ధ వాతావరణంలా ఉండేది. అప్పుడు 12వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎర్ర ప్రకాశ్‌రెడ్డి, మరో పార్టీ నుంచి రావు అమరేందర్‌రెడ్డి పోటీ చేశారు. ఆ ఎన్నికల ప్రచారంలోనూ ఫైటింగ్ జరిగింది. అదే సమయంలో నాపై తొలిసారి రాజకీయ కేసు నమోదైంది. ఆ కేసునూ బస్వరాజు సారయ్యే డీల్ చేశారు. 1988లో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో డిగ్రీలో చేరాను. మూడు నెలలకే నాపై దాడి జరిగింది. వడ్డేపల్లి ప్రాంతానికి చెందినవారంటే అప్పట్లో భయం ఉండేది. నేను మాత్రం నా టీమ్‌ను నడుపుకునేవాడిని. నాపై దాడి చేస్తే రివెంజ్ తీసుకుంటానని వారికి తెలుసు. రెండు మూడు రోజులు ఓపిక పట్టి, గ్రౌండ్‌లో దొరికినవారిని దొరికినట్టుగా హాకీ స్టిక్స్‌తో కొట్టాం. ఆ తర్వాత డిగ్రీ ఫస్టియర్‌లోనే నాకు ఎన్ఎస్‌యూఐ కాలేజీ అధ్యక్ష పదవి ఇచ్చారు. విద్యార్థుల సమస్యలపై నిలదీసేవాడిని. నన్ను కాలేజీ నుంచి బయటకు పంపించేందుకు ఎన్నో ప్రయత్నాలు జరిగాయి.

### బిడ్డకు టికెట్ ఇస్తే బరిలోకి

నా బిడ్డ గోదాదేవి మంచి డాక్టర్. 2014లోనే కాంగ్రెస్ సభ్యత్వం తీసుకుంది. ప్రస్తుతం ఎస్ఐఆర్ ప్రక్రియలో కీలకంగా పనిచేస్తోంది. 240 మంది బీఎల్‌ఓలు, 240 మంది బీఎల్‌ఏలను సమన్వయం చేసింది. ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేసి వరంగల్ పశ్చిమలో ఎస్ఐఆర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఓట్లు కోల్పోకుండా పనిచేస్తోంది. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ ఆదేశిస్తే గోదాదేవి తప్పకుండా పోటీ చేస్తుంది. డిసెంబర్ లేదా జనవరిలో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. రిజర్వేషన్లు మారొచ్చు. కొత్తగా ఏర్పాటు చేసిన కార్పొరేషన్ల నేపథ్యంలో మరోసారి రిజర్వేషన్లలో మార్పులు జరిగే అవకాశం ఉంది. డివిజన్ల సంఖ్య కూడా పెరగొచ్చు.

### యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవే నా రాజకీయ మలుపు

నా రాజకీయ జీవితాన్ని మలుపు తిప్పింది యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి. పీవీ రంగారావు నన్ను ప్రోత్సహించారు. దేవేందర్‌రెడ్డితో పోటీ ఉన్నప్పటికీ ఆయన వర్గాన్ని కాదని నాకు అవకాశం ఇచ్చారు. విజయవాడలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమరభేరి సభ పెట్టినప్పుడు నేను 102 వాహనాలు ఏర్పాటు చేశాను. అందులో 100 సుమోలు, రెండు బస్సులు ఉన్నాయి. వాటికి నా ఫొటోలతో పోస్టర్లు పెట్టించాం. గోల్డ్‌స్మిత్ వృత్తిలో ఉన్న స్నేహితుడు ఒకడు విజయవాడలో ఉండేవాడు. అతనికి ఫోన్ చేసి భోజనాలు, నీళ్ల ప్యాకెట్లు, నాలుగు బ్యానర్లు ఏర్పాటు చేయమన్నాను. కానీ నేను చెప్పినదానికంటే రెట్టింపు ఏర్పాట్లు చేశాడు. జంబో పూలదండ, పెద్ద పెద్ద కటౌట్లు కూడా పెట్టించాడు. రమేశ్‌బాబు, వినోద్‌కుమార్, అజీజ్‌ఖాన్ నాతో వచ్చారు. నా దోస్తు ఎంత బిల్లు పంపిస్తాడోనని భయపడ్డా. చివరకు ఏ బిల్లూ పంపలేదు.



కాకతీయ,తెలంగాణ బ్యూరో/
- కిరణ్ గౌడ్ అరెల్లి
7396604266

### 2023లో మళ్లీ మొదలైన టికెట్ పోరాటం

2023 ఎన్నికల్లో ఎన్నో కుట్రలను దాటుకుని టికెట్ తెచ్చుకున్నాను. రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వచ్చి పీసీసీ అధ్యక్షుడైన తర్వాత ఆయనను కలిసి, నాకు టికెట్ ఇస్తే కష్టపడి పనిచేస్తానని చెప్పాను. 2009 నుంచి టికెట్ చేజారిపోతోందని, నేను పనిచేసే సమయానికి వేరేవాళ్లు రావడం పరిపాటిగా మారిందని చెప్పాను. ఇస్తే ఇస్తామని చెప్పండి. లేదంటే రాదని కూడా చెప్పండి. నేను కాంగ్రెస్‌ను వదిలి వెళ్లే వ్యక్తిని కాదు. కానీ క్లారిటీ లేకుండా పనిచేయలేనని, ఇప్పటికే అనేక రకాలుగా నష్టపోయి.. అలసిపోయానని చెప్పడంతో.. సర్వే రిపోర్టు వచ్చిన తర్వాత చెబుతానన్నారు. రిపోర్టు వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి నుంచి స్వయంగా సానుకూల సంకేతం వచ్చింది. ముందుకు వెళ్లాలని సూచించారు. ఫస్ట్ లిస్ట్‌లో నా పేరు రావాల్సి ఉన్నా కొందరు అడ్డుకున్నారు. అధిష్ఠానం వద్ద నాపై ఏవేవో చెప్పారు. రీసర్వేలు, స్పాట్ సర్వేలు జరిగిన తర్వాత చివరకు నాకు టికెట్ వచ్చింది. సొంత పార్టీలోనూ నన్ను తొక్కే ప్రయత్నాలు జరిగాయి. వీడు వస్తే మాకు రాజకీయ భవిష్యత్ ఉండదనుకునేవాళ్లు ఉన్నారు. అయినా నేను వెనక్కి తగ్గలేదు.

### కేసులు.. ప్రలోభాలు వెంటాడాయి..అయినా కండువా మార్చలేదు

నాపై కేసులు పెట్టి వేధించినప్పుడు పార్టీ మారితే అన్నీ మాఫీ చేస్తామని ప్రలోభాలు పెట్టారు. బీఆర్ఎస్, బీజేపీ, సొంత పార్టీ కాంగ్రెస్‌లోనూ కొట్లాటలు ఉన్నాయని చెబుతూ పార్టీ మారాలని రాత్రిళ్లు ఇంటికి వచ్చి మరీ కొందరు అడిగారు. ఇప్పటికీ నాపై 54 కేసులున్నాయి. మర్డర్ కేసులోనూ ఇరికించారు. కుటుంబంలో విషాదం జరిగిన సమయంలో కూడా కేసుల కారణంగా తప్పించుకుని తిరగాల్సి వచ్చింది. ఎన్ని కేసులు పెడతారో పెట్టుకోండి.. పార్టీ మాత్రం మారను అని చెప్పాను. నా మెడలో కాంగ్రెస్ కండువా తప్ప మరో కండువాను నేను ఊహించుకోలేదు. మర్డర్ కేసులో ఇరికించినప్పుడు సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలో మాదిరిగా పోలీసులకు చిక్కకుండా తిరిగిన రోజులు ఉన్నాయి. ఒక పెద్దమనిషి నా గురించి ఇలాంటి పిచ్చోళ్లవల్లే ఆ పార్టీ ఇంకా బతుకుతోందని అన్నాడు. దాన్ని నేను తిట్టు లాంటి పొగడ్తగా తీసుకున్నాను.

### వరంగల్ బ్రాండ్ పెంచడమే నా ముందున్న పని

నాకు నా నియోజకవర్గం మాత్రమే కాదు, వరంగల్ బ్రాండ్ పెరగాలి. ముఖ్యమంత్రి వద్ద అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, మామునూరు ఎయిర్‌పోర్టు, రింగ్‌రోడ్డు వంటి పనులకు నిధులు అడిగాను. రూ.500 కోట్లతో వాటర్ సప్లై పైప్‌లైన్‌ను మెరుగుపరుస్తున్నాం. రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు ప్రారంభించాం. ఐటీఐ కాలేజీకి రూ.25 కోట్లు తీసుకొచ్చాను. కాజీపేట బ్రిడ్జి పనులు నేను ఎమ్మెల్యేగా వచ్చిన తర్వాత వేగం పుంజుకున్నాయి. త్వరలో పూర్తి చేస్తాం. కాజీపేట బస్టాండ్ కూడా మంజూరు చేయించాను. నాకు అసెంబ్లీలో కూర్చోవాలనే కోరిక ఉండేది. అది నెరవేరింది. వర్కింగ్ ప్రెసిడెంట్ కావాలని అడిగాను. నాకు పని చేయడం ఇష్టం. అందుకే పార్టీ పదవి అడిగాను. పెద్దలు ఏ పదవి ఇచ్చినా నాకు బోనస్సే.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266